క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ



ఎమ్మెల్యే కవ్వంపల్లితో ఎంపీపీ వెంకటరమణా రెడ్డి

తంగళ్లపల్లి:మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మంగళవారం ఉగాది పండగ సందర్భంగా ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకట రమణారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు నాయకులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, కడగండ్ల తిరుపతి, మంద రాజు తదితరులున్నారు.

నేటి నుంచి శతచండీ మహాయాగం

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట హరిహర ఆలయంలో శతచండీ మహాయాగ కార్యక్రమాలు బుధవారం నుంచి ఈనెల 14 వరకు నిర్వహించనున్నారు. జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి వారి వర్ధంతి సందర్భంగా ఆలయంలో లోక కల్యాణార్థం శతచండీ పారాయణం, లక్షణవార్ణ జప దశాంశ హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వేద పండితులు రాధాకృష్ణశర్మ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



మాట్లాడుతున్న కొండల్‌రావు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కొండగట్టు బృందావన్ రిసార్ట్ యజమాని మర్రిపల్లి కొండల్‌రావు–మాధవి దంపతులు రూ. 1.20 లక్షల విలువ చేసే లారీ లోడ్ సిమెంట్ బస్తాలను వితరణగా అందించారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ తరఫున ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.3 కోట్లు నిధులు మంజూరు చేశారు. మిగతా నిర్మాణ పనుల కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. కొండల్‌రావు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వేములవాడ: పండుగపూట పస్తులుండొద్దని మై వేములవాడ ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. తమ ట్రస్ట్ ద్వారా 1078 రోజులుగా నిత్యం అన్నదానం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మధు మహేశ్, ప్రతాప నటరాజు, చల్లా సత్తయ్య, పాత సంతోష్, గొండ ప్రసాద్, నక్క వేణు, పసూల శ్రీనివాస్ ఇందుకు సహకరిస్తున్న దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

ముస్తాబాద్: పట్టణ పద్మశాలీ సంఘం ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా తడుక బాలకిషన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గొడ మల్లేశ్, ఎనగందుల దశరథం, ప్రధాన కార్యదర్శిగా దొంత బాలరాజు, శాశ్వత గౌరవ అధ్యక్షులుగా తాటిపాముల లక్ష్మీనారాయణ, కోశాధికారులుగా గొడ కృష్ణహరి, శ్రీరాం మనోహర్, కార్యదర్శిగా బిట్ల దేవానందం ఎన్నికయ్యారు. పద్మశాలీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేత

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ప్రాంతంలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు ఓదెల నరేశ్ అనే వికలాంగుడు మంగళవారం మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన నరేశ్ 2016 నుంచి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తాను చేసిన కూలి పనిలో వచ్చినదాంట్లో సగభాగం సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తున్నట్లు ఆయన చెబుతున్నాడు.





బోయినపల్లి: తడగొండ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎల్లారెడ్డిపేట: పంచాంగం వినిపిస్తున్న వేద పండితుడు



కోనరావుపేట: పుట్టల మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు



వేములవాడఅర్బన్: అగ్రహారం హనుమాన్ ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న వేద పండితుడు

ఊరూరా ఉగాది వేడుకలు

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని మండలకేంద్రాలు, అన్నిగ్రామాల్లో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉదయాన్నే స్నానాలు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అన్ని ఆలయాల్లో పంచాంగం వినిపించారు. ఇళ్లలో షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి, భక్ష్యాలు చేసుకొని ఆరగించారు. ఆలయాల్లో పలువురు నాయకులు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వేద పండితులు పంచాంగ వినిపించి ఆదాయ, వ్యయాలు వివరించారు. రైతులు వ్యవసాయ పనులకు సాగుబడి చేశారు. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల శివారులో పుట్టల మల్లన్న ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకులు గంగాధర్, నందూగౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గంభీరావుపేట: రామాలయంలో పంచాంగ శ్రవణం



వీర్నపల్లి : పంచాంగం వినిపిస్తున్న వేద పండితుడు



గంభీరావుపేట: హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



ముస్తాబాద్: మొర్రాయిపల్లెలో పంచాంగ శ్రవణంలో గ్రామస్తులు



చందుర్తి: పంచాంగం వింటున్న గ్రామస్తులు, నాయకులు



సిరిసిల్ల టౌన్ : తెలంగాణ భవన్‌లో ఉగాది వేడుకలు



తంగళ్లపల్లి : ఇల్లంతకుంటలో పంచాంగం వింటున్న గ్రామస్తులు



సిరిసిల్ల టౌన్ : డీసీసీ భవన్‌లో పంచాంగం వింటున్న కాంగ్రెస్ నాయకులు



రుద్రంగి: హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం

ఇఫ్తార్‌విందు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో ముస్లింలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్ గౌడ్ మాట్లాడుతూ.. రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. నాయకులు పాశం దేవిరెడ్డి, దేవయ్య, పాటి దేవయ్య, ముస్లింలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మురుగుకాలువ ఇలా .. నీరు వెళ్లేదెలా?

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మురుగుకాలువ కూలిపోయి నెలలు గడుస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ నుంచి మూలవాగులోకి మురుగునీటిని పంపే కాలువ నాణ్యతా లోపంతో కూలిపోయింది. దీంతో నీరు నిల్వ ఉండి పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. వెంటనే మురుగు కాలువకు మరమ్మతు చేయాలని పలువురు కోరుతున్నారు.



‘సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతాం’

సిరిసిల్లటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన పిట్టల భూమేశ్ ప్రకటించారు. ఈమేరకు మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సంక్షేమ పాలన అభినందనీయమన్నారు. శ్రేయోభిలాషులు, అభిమానుల అభీష్టం మేరకు కాంగ్రెస్‌లో చేరతున్నట్లు పేర్కొన్నారు. మధుకర్, బొజ్జ నరేష్, సామల వెంకన్న తదితరులు ఉన్నారు.



మాటాడుతున్న పిట్టల భూమేశ్

నేతన్నలకు అండగా బీజేపీ



బోయినపల్లి : మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



ముస్తాబాద్ : మాట్లాడుతున్న అంజాగౌడ్

బోయినపల్లి: సిరిసిల్ల నేతన్నలకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నేతన్నల సమస్యలపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈనెల 10న నేతన్నకు అండగా భరోసా దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారని, బతుకమ్మ చీరల బకాయిలు చెల్లిస్తామని, ఆర్డర్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన క్రమంలో దీక్ష వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. నేతన్నలు, ఆసాములకు మద్దతుగా బండి సంజయ్ చేసిన పోరాటాలతో ప్రభుత్వం దిగి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎడపెల్లి పరశురాం, సుంకపాక ప్రభు, రెడ్డవేని రాజు తదితరులున్నారు.

ముస్తాబాద్: నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగివచ్చిందని, ఎంపీ బండి సంజయ్ నేతన్న దీక్ష చేపడుతామని ప్రకటించగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ చీరల బకాయిల విడుదల, భవిష్యత్తులో కార్మికులకు చేతినిండా ఉపాధి కల్పించాలన్న డిమాండ్‌తో బండి సంజయ్ దీక్ష చేపడుతామని ప్రకటించారన్నారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ నేతన్నలతో చర్చలు జరిపారని, బకాయిల విడుదలతోపాటు చేతినిండా పని కల్పిస్తామన్న హామీ మేరకు బీజేపీ దీక్షను వాయిదా వేసినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు రమేశ్‌రెడ్డి, శంకర్, నరేశ్, గోపి, మహేశ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- ధర్మారం – చంద్రగిరి రోడ్డు పనుల్లో ఆలస్యంతోపాటు నాణ్యతా లోపం
- కంకరపోసి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు
- పనులు త్వరగా పూర్తిచేయాలని పలువురి డిమాండ్



కంకరపోసి వదిలేసిన రామన్నపేట రహదారి

కోనరావుపేట: రూ.లక్షలాది రూపాయలతో చేస్తున్న తారురోడ్డు పనులు ఆలస్యమే కాకుండా నాసిరకంగా జరుగుతున్నాయని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల పట్టింపులేమితో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పనులు చేస్తున్నారని, ఈ పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోనున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రూ.3.05 కోట్లు మంజూరు

మండలంలోని ధర్మారం నుంచి నాగారం, రామన్నపేట, చంద్రగిరి మీదుగా అగ్రహారం వరకు గల సుమారు ఏడు కిలోమీటర్ల రహదారిని తారురోడ్డుగా మార్చేందుకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) శాఖ నుంచి రూ.3.05 కోట్లు మంజూరు కాగా ఈ పనులను 2021నవంబర్ 1 ప్రారంభించారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొన్నినెలల క్రితం ప్రారంభించి కొంతమేర పనులు చేపట్టి నిలిపివేశారు.

తగ్గనున్న దూరభారం

కోనరావుపేట మండలం ధర్మారం నుంచి ప్రారంభించిన రహదారితో నాగారం, రామన్నపేట, చంద్రగిరి గ్రామాల మీదుగా అగ్రహారం వరకు వెళ్లేందుకు వీలుంది. దీంతో ఆయాగ్రామాల ప్రజలకు దూరభారం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. అన్ని గ్రామాల ప్రజలు ఈ రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తున్నారు. రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. ఈ రోడ్డు పూర్తయితే అన్నిగ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

కంకరపోసి.. వదిలేసి

ధర్మారం నుంచి అగ్రహారం వరకు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మొదటి నుంచి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నాసిరకం మట్టిని వినియోగించడంతో మొదటి నుంచి పనులను వ్యతిరేకిస్తున్నారు. రోడ్డు పనుల్లో నాసిరకం మట్టిని వినియోగిస్తున్నారని, కంకరపోసి అలాగే వదిలేశారు.

నాణ్యతతో చేపట్టాలి



ధర్మారం – రామన్నపేట మీదుగా జరుగుతున్న రహదారి పనులు నాణ్యతతో చేపట్టడం లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పలుసార్లు కాంట్రాక్టర్‌ను కోరినా ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి. లేకపోతే పనులను అడ్డుకుంటాం.

– సైండ్ల రవి, నాగారం

ప్రమాదాలు జరుగుతున్నాయి



ధర్మారం నుంచి వేములవాడ వెళ్లేందుకు ఈ దారి దగ్గరగా ఉంటుంది. ఈ రోడ్డు పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయి. కంకర పోసి వదిలేయడంతో తరచూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి.

– ములికె నవీన్, రామన్నపేట

నాణ్యత లోపిస్తే చర్యలు



ధర్మారంనుంచి రామన్నపేట, చంద్రగిరి తారురోడ్డు పనులు బిల్లుల జాప్యంతో నిలిచాయి. పనులు నాణ్యతతో చే యిస్తున్నాం. సుమారు 70 శాతం మేర పనులు జరిగాయి. బీటీ, సీసీరోడ్డు పనులు మిగిలి ఉన్నాయి. నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చర్యలు తీసుకుంటాం.

– మనోహర్, ఏఈ పంచాయతీరాజ్

అకాల వర్షాలు కురవొద్దని ముడుపు

ఎల్లారెడ్డిపేట: అకాలవర్షాలు కురవొద్దని కోరుతూ మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీ హనుమాన్ ఆలయంలో మంగళవారం రైతులు ముడుపు కట్టారు. అర్చకులు వేణుగోపాలచారి, శివశాస్త్రిల వేదమంత్రాల మధ్య ముడుపు కట్టారు. వడగళ్ల వానలతో పంటలు నష్టపోకుండా రైతులు ముడుపు కట్టడం అనావాయితీగా వస్తోంది. జూన్‌లో ముడుపు విప్పి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, నాయకులు సూర నర్సయ్య, నారాయణరెడ్డి, లింగాల అంజాగౌడ్, మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, లద్దునూరి హన్మాండ్లు, నర్సాగౌడ్, బుచ్చిరెడ్డి, కిషన్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ముడుపు కడుతున్న రైతులు

13 నుంచి అన్నదానం

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి వృద్ధులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాత దైవానంద స్వామి తెలిపారు. ఆలయంలో మంగళవారం మాట్లాడారు. పలు గ్రామాలకు చెందిన దాతల సహకారంతో అమలు చేయనున్న ఈ కార్యక్రమంలో వృద్ధులు, సాధువులకు రోజూ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమానికి దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి, పోచెట్టిపల్లి మధ్య ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. నాగాయపల్లి నుంచి చందుర్తికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగి నట్లు తెలిసింది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.